విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189



# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 126 | volume: 1, Issue: 126 | గురువారం 04 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల : 3.00


## త్వరలో 40 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




–ఉద్యోగావకాశాల విస్తరణకు ప్రభుత్వం కట్టుబాటు...

–రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేసిన సీఎం...

**హుస్నాబాద్ 03 డిసెంబర్ :** తెలంగాణలో మరో 40 వేల ప్రభుత్వ ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేసే ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండున్నర సంవత్సరాల్లో మొత్తం లక్ష ఉద్యోగాలను భర్తీ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. హుస్నాబాద్‌లో ప్రజా పాలన %-% ప్రజా విజయోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన బహిరంగ సభలో ప్రసంగించారు. హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. గత పదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన గౌరెల్లి రిజర్వాయర్ పనులను పూర్తి చేసే బాధ్యత తన ప్రభుత్వం తీసుకున్నట్లు చెప్పారు. స్థానిక చరిత్రలో సర్దార్ పాపన్న గౌడ్ గారి పోరాటాన్ని గుర్తుచేసి, బహుజనుల హక్కుల కోసం చేసిన ఉద్యమాలకు ఈ ప్రాంతం నిలయమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన శ్రీకాంత చారి త్యాగాన్ని ముఖ్యమంత్రి స్మరించారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఒక సంవత్సరంలో 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, ఇది శ్రీకాంత చారి ఆశయ సాధనలో భాగమని చెప్పారు. తెలంగాణను భవిష్యత్తులో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వానికి స్పష్టమైన ప్రణాళిక ఉందని ఆయన వివరించారు. వ్యవసాయ రంగంలో రైతుల కోసం 1.04 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఇళ్ల పంపిణీ, రేషన్ కార్డుల జారీ, తొలి ఏడాదిలో 60 వేల ఉద్యోగాల భర్తీ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేసిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ప్రజల ఆశయాల్ని నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు.

## రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ ఆందోళన



**హైదరాబాద్,** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందూ దేవతలను అవమానించాయని ఆరోపిస్తూ బీజేపీ నేతృత్వంలో హైదరాబాద్‌లో ఆందోళనలు జరిగాయి. బీజేపీ యువజన మోర్చా తెలంగాణ అధ్యక్షుడు గణేష్ కుందే నాయకత్వంలో వందలాది కార్యకర్తలు కాంగ్రెస్ పీసీసీ కార్యాలయాన్ని ముట్టడి చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విగ్రహానికి నిప్పంటించారు. ఆందోళనకారులు, రేవంత్ వ్యాఖ్యలు కోట్ల మంది హిందువుల మతభావాలను దెబ్బతీశాయని, ఇది మతపరమైన అసహనం పెంచే చర్య అని ఆరోపించారు. సనాతన ధర్మాన్ని లక్ష్యంగా చేసుకునే వ్యాఖ్యలను ప్రజలు సహించబోరని బీజేపీ కార్యకర్తలు తెలిపారు. మతపరమైన భావాలను ఎగతాళి చేసే చర్యలను అడ్డుకోవడంలో తమ పార్టీ దృఢంగా ఉంటుందని వారు ప్రకటించారు.ప్రజల విశ్వాసాలపై దాడులు జరుగుతుంటే మౌనంగా ఉండబోమని, దేవతలను వెక్కిరించే ప్రవర్తనకు ప్రతిస్పందన తప్పదని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. హిందూ ధర్మాన్ని రక్షించడం తమ బాధ్యత అని, దీని కోసం అవసరమైతే తీవ్రంగా పోరాడతామని హెచ్చరించారు.తెలంగాణ రాజకీయాల్లో వేడెక్కుతున్న వాతావరణంలో ఈ ఆందోళనలు మరింత ఉద్రిక్తత సృష్టించే అవకాశముందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రేవంత్ వ్యాఖ్యలపై ప్రభుత్వం లేదా కాంగ్రెస్ పార్టీ నుంచి స్పందన రానున్న రోజుల్లో వెలువడే అవకాశం ఉంది.

## వికలాంగుల సాధికారత

## దేశ బాధ్యత: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



- సమాన హక్కుల దిశగా సామాజిక మార్పు అవసరం...
- దయ కాదు, గౌరవమే ప్రాతిపదిక కావాలి...
- ప్రభుత్వ చర్యలను రాష్ట్రపతి ప్రశంస...

**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగుల సాధికారతకు సేవలు అందించిన వ్యక్తులు మరియు సంస్థలకు ఈ సంవత్సరం జాతీయ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము న్యూఢిల్లీలో ప్రదానం చేశారు. పురస్కార గ్రహీతల కృషి దేశానికి గర్వకారణమని ఆమె అభినందించారు. రాష్ట్రపతి మాట్లాడుతూ, వికలాంగుల పట్ల సేవ చేయడం మాత్రమే కాదు, వారి హక్కులను పరిరక్షించే దిశగా సమాజం, ప్రభుత్వం కలిసి ముందుకు రావాలని సూచించారు. వికలాంగులను రక్షణకు పాత్రులుగా కాకుండా సమాన హక్కులు కలిగిన భాగస్వాములుగా చూడాల్సిన సమయం ఆసన్నమైందని ఆమె పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి పట్ల దయ ఆధారంగా చూసే సమాజం కంటే, గౌరవం ఆధారంగా స్వీకరించే సామాజిక వాతావరణమే నిజమైన సమావేశక సమాజాన్ని నిర్మిస్తుందని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. డివ్యాంగుల ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించే సంస్కృతి అవసరమని ఆమె అన్నారు. వికలాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చట్టపరమైన చర్యలు, విధానాలు, పరిపాలనా మార్పులను రాష్ట్రపతి ప్రశంసించారు. సమాన అవకాశాలు, సాంకేతిక సహకారం, సులభతర సేవలు వంటి అంశాల్లో ప్రభుత్వం జరుపుతున్న కృషి భవిష్యత్‌లో మరింత ఫలప్రదం కావాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## రేవంత్ రెడ్డి హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందూ దేవుళ్లను అవమానించేవిగా ఉన్నాయని ఆరోపిస్తూ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు.




హిందూ సమాజానికి వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ధోరణి హిందూ దేవుళ్లను అవమానించడమేనని, దీనిపై హిందూ సమాజం మౌనం పాటించదని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కోట్లాది హిందువుల మనోభావాలను గాయపరిచేలా ఉన్నాయని అన్నారు. గతంలో కేసీఆర్ హిందుగాళ్లు, బొందుగాళ్లు అన్న వ్యాఖ్యలపై ప్రజలు ఇచ్చిన తీర్పు గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రజల విశ్వాసాలను దెబ్బతీసే ప్రయత్నం చేసే రాజకీయ నాయకులను సమాజం సహించబోదని హెచ్చరించారు.రాష్ట్రంలో రైతులకు ఒక విధానం, పారిశ్రామికవేత్తలకు మరో విధానం అనుసరించడంపై ఆయన విమర్శించారు. హిల్ట్ పాలసీని ఆలోచన లేకుండా అమలు చేస్తున్నారని, ఇది చిన్న రైతుల ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. నగరాభివృద్ధి పేరుతో ఎకరాల కొద్దీ భూములను వాణిజ్యీకరణ చేయడం ప్రమాదకరమని తెలిపారు. హైదరాబాద్‌లో 9 వేల ఎకరాల్లో మల్టీపర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించడం వల్ల ట్రాఫిక్, మౌలిక సదుపాయాలు, వాతావరణ సంబంధిత సమస్యలు మరింత తీవ్రత పొందే అవకాశముందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యల కారణంగా పెట్టుబడులు తగ్గాయని గుర్తు చేస్తూ, హైదరాబాద్‌ను కూడా అదే దిశలో నడిపితే ప్రమాదం తప్పదని హెచ్చరించారు. గతంలో కేసీఆర్, ఇప్పుడు రేవంత్ ఇద్దరూ తమను "ఏకైక మేధావులు"గా ప్రకటించుకునే తీరు రాష్ట్రానికి మంచిది కాదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విమర్శలు, చర్చలకు స్థలం ఉండాలి కానీ దేవతలను అవమానించే వ్యాఖ్యలకు స్థానం లేదని స్పష్టం చేశారు.

## నేవీ డే కార్యక్రమంలో పాల్గొన్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**తిరువనంతపురం,** నేవీ డే 2025 వేడుకల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. కేరళలోని తిరువనంతపురంలో నిర్వహించిన భారత నౌకాదళ ఆపరేషనల్ డెమోను ఆమె ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా నౌకాదళ సిబ్బంది ప్రదర్శించిన సముద్ర రక్షణ నైపుణ్యం, యుద్ధ సామర్థ్యం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే శక్తి ప్రజలను ఆకట్టుకున్నాయి. సముద్ర మార్గాలను భద్రపరచడం, సముద్ర వనరులను రక్షించడం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం, సముద్ర పరిశోధనకు మద్దతు ఇవ్వడం వంటి విభాగాల్లో భారత నౌకాదళం కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. దేశ ఆర్థిక, భద్రతా వ్యవస్థలకు సముద్రాల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో, నౌకాదళం చేపడుతున్న విధులు అత్యంత ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. సురక్షిత, సమృద్ధిగా, పర్యావరణపరంగా నిలకడగల సముద్రాలను నిర్మించాలన్న భారత దృష్టిని నౌకాదళం సమర్థంగా ముందుకు తీసుకెళ్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. సముద్ర భద్రత బలోపేతం దేశ అభివృద్ధికి పునాది అని, నౌకాదళ సిబ్బంది దేశం కోసం చేస్తున్న సేవలను ఆమె అభినందించారు.

## బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులు



**డెస్క్,** భారతదేశం మొత్తం చిన్నారులపై లైంగిక దాడి ఘటనలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. పాఠశాలలు, వీధులు, ఇళ్ళు, పరిచయ వర్గాలే పిల్లలకు ప్రమాదకర ప్రదేశాలుగా మారుతున్నాయి. ప్రతి రోజు దేశవ్యాప్తంగా వెలుగులోకి వస్తున్న లైంగిక దాడి కేసులు, సామాజిక భద్రతపై అసలు ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. కుటుంబాలు పిల్లలను రక్షించేందుకు పోరాడుతుంటే, న్యాయం కోసం సంవత్సరాల తరబడి కోర్టుల్లో తిరగాల్సిన పరిస్థితి నెలకొంటోంది. చిన్నారులపై లైంగిక నేరాలు చేసే నిందితులలో అధిక శాతం పరిచయ వ్యక్తులే ఉండడం కుటుంబాలకు భయానక స్థితిని సృష్టిస్తోంది. చట్టపరమైన చర్యలు తీసుకున్నా, దర్యాప్తు, ట్రయల్ ప్రక్రియలు సుదీర్ఘంగా సాగడం, సాక్ష్యాలు లేని సందర్భాల్లో నిందితులు బయటపడటం, నిర్భయంగా తిరగడం, సమాజంలో అసురక్షిత వాతావరణాన్ని పెంచుతున్నాయి. "న్యాయం రాగానే చిన్నారి జీవితంలో గాయాలు మిగిలిపోతాయి" అనేది బాధిత కుటుంబాల వేదన. కావాలి, అమలు వేగవంతం కావాలి"దేశవ్యాప్తంగా బాలల దుష్ప్రయోగ కేసులపై స్పెషల్ కోర్టులు, వేగవంతమైన విచారణ, కఠిన శిక్షలు అమలు చేయకపోతే నేరాల సంఖ్య తగ్గదని నిపుణులు అంటున్నారు. బాధితులు న్యాయం కోసం కాదు, జీవనోపాధి కోసం పోరాడుతున్న సమయంలో, ప్రభుత్వాలు, సమాజం, కుటుంబాలు కలిసి బాధ్యత తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.చట్టాలు కఠినంగా ఉండడం సరిపోదు, అమలు కఠినంగా ఉండాలి. ప్రతి చిన్నారి భద్రత దేశ భద్రత అనే భావన చేరే వరకు ఈ యుద్ధం ఆగదని సామాజిక సంస్థలు చెబుతున్నాయి.

## వాహనాలను తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం...

**చిన్న శంకరం పేట డిసెంబర్ 4( మన వార్త ప్రతినిధి )** ఎన్నికల కోడ్ను ఉల్లంఘించకూడదని ప్రతి ఒక్కరు తప్పనిసరి ఎన్నికల నియమాలను పాటించాలని డిప్యూటీ తాసిల్దార్ ప్రభుదాస్ తెలిపారు, అక్రమ మద్యం రవాణా చేసిన 50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లిన సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. చిన్న శంకరంపేట మండల కేంద్రంలో మెదక్ చేగుంట రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వాహనాలను తనిఖీ చేశారు, ప్రైవేటు కార్లతో పాటు ఆర్టీసీ బస్సులో సైతం తనిఖీలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున వాహనాలను తనిఖీ చేయడం జరుగుతుందని ఎవరు కూడా ఎన్నికల నియమాలకు విరుద్ధంగా వెళ్లకూడదని అక్రమంగా మద్యం తరలించిన వాహనాలలో 50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లిన వాటిని సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు ఎన్నికల నియమాలను పాటిస్తూ ప్రజలు సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రభుదాస్ హెడ్ కానిస్టేబుల్ నర్సింలు సిబ్బంది పాల్గొన్నారు.



## సమిష్టి కృషితో మల్లారం సర్పంచి స్థానాన్ని కైవసం చేసుకుందాం

**-కాంగ్రెస్ సిపిఐ నేతలు...**

**మధిర డిసెంబర్3( మన వార్త):** సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలలో సమిష్టి కృషితో సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకోవటానికి కాంగ్రెస్, సిపిఐ శ్రేణులు సమాయత్తం కావాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నూరంశెట్టి కిషోర్ పిలుపునిచ్చారు. మంగళవారం మధిర మండల పరిధి మల్లవరం గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ సర్పంచ్ అభ్యర్థి కామ్రేడ్ మందడపు రాణిని కాంగ్రెస్ పార్టీ బలపరిచినట్టు సిపిఐ కాంగ్రెస్ ఉమ్మడి సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ,మల్లారంలో సిపిఐ విజయానికి కాంగ్రెస్,సిపిఐ పార్టీల ప్రతీ కార్యకర్త ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో కర్నాటి రామారావు,విజయ్ తన్నీరు,రామకృష్ణ,కరివేద దుర్గ భవాని,కరివేద రాంబాబు,పరుచూరి రాము, వెంకటేశ్వరావు,మచ్చ వెంకటేశ్వరరావు,మడుపల్లి లక్ష్మణ్,కొంగర మురళి తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన యువకులకు డ్రైవింగ్ శిక్షణతో ఉద్యోగావకాశాలు

**భద్రాచలం, డిసెంబర్ 3. ( మన వార్త ప్రతినిధి).** నిరుద్యోగ గిరిజన యువకులు డ్రైవింగ్ శిక్షణ పొందిన అనంతరం సమయాన్ని వృధా చేయకుండా వివిధ సంస్థల్లో డ్రైవర్ ఉద్యోగాలు సంపాదించుకొని కుటుంబాన్ని పోషించుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. బుధవారం ఆయన తన ఛాంబర్లో వరంగల్ జోనల్ డ్రైవింగ్ ట్రైనింగ్ కాలేజ్ (టిజిఎస్ఆర్టిసి)లో హెచ్ఎమ్వి డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన గిరిజన యువకులను కలసి, వారికి శిక్షణ అనుభవం, వసతి సౌకర్యాలు, ఆర్టీసీ శిక్షకుల మార్గదర్శనం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి శిక్షణ పూర్తైన సర్టిఫికెట్లు అందజేశారు. అధికారిగా మాట్లాడిన బి. రాహుల్, వాయిటిసిలో నెలరోజులు ఎల్ఎమ్వి డ్రైవింగ్, అనంతరం వరంగల్లో హెచ్ఎమ్వి శిక్షణ పొందిన యువకులు పూర్తి స్థాయిలో డ్రైవింగ్లో నైపుణ్యం సంపాదించారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం మరియు భద్రాచలంలో ఆర్టీవో ద్వారా వీరికి డ్రైవింగ్ లైసెన్సులు అందించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్సులను సద్వినియోగం చేసుకుంటూ విమానాశ్రయాలు, నవతా ట్రాన్స్పోర్ట్, సింగరేణి బొగ్గు గనుల వంటి సంస్థల్లో డ్రైవర్ ఉద్యోగాలు పొందేందుకు ప్రయత్నించాలని యువకులను సూచించారు. రానున్న రెండు మూడు నెలల్లో ఈ యువకులు ఏదో ఒక కంపెనీలో డ్రైవర్ ఉద్యోగంలో ఉండాలని ఆశ వ్యక్తం చేశారు. డ్రైవర్గా పనిచేసేటప్పుడు వ్యక్తిగత రక్షణతో పాటు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని, ఎప్పుడూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రంకన్ డ్రైవింగ్కి పాల్పడరాదని హితవు పలికారు. గిరిజన యువకులు ఆదర్శంగా నిలిచి, ఇతరులకు కూడా డ్రైవింగ్ శిక్షణ తీసుకునే ప్రేరణ కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ, వివిధ మండలాల గిరిజన యువకులు పాల్గొన్నారు.



## భద్రాచలం గ్రామపంచాయతీ ఎన్నికలు : కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

**భద్రాచలం, డిసెంబర్ 3. ( మన వార్త ప్రతినిధి).** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఈ రోజు ప్రకటించింది. భద్రాచలం శాసనసభ్యులు డా. తెల్లం వెంకట్రావు, తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలు సమావేశమై ఏకాభిప్రాయానికి వచ్చారు. 11 సంవత్సరాల తర్వాత జరిగే ఈ ఎన్నికల్లో పూనెం కృష్ణను సర్పంచ్ అభ్యర్థిగా ఎంపిక చేశారు. కాంగ్రెస్ నాయకుల సమావేశం. ఈ రోజు జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ప్రముఖ నాయకులు చర్చలు నిర్వహించి, భద్రాచలం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి పూనెం కృష్ణను అభ్యర్థిగా ధృవీకరించారు. వార్డు సభ్యుల అభ్యర్థిత్వాలను కూడా ఈ సమావేశంలోనే ప్రకటించారు. ఈ ఎన్నికల నామినేషన్లు ఇప్పటికే దాఖలు కావడంతో పోటీ తీవ్రమవుతోంది. ఎన్నికల నేపథ్యం భద్రాచలం గ్రామపంచాయతీలో 20 వార్డులు ఉండగా సర్పంచ్ మరియు వార్డులు గెలుపే లక్ష్యం గా ఉండాలని పిలుపునిచ్చారు.



## వికలాంగ చిన్నారులకు క్రీడాసామగ్రి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అందజేత

**-వికాసం పాఠశాలకు టెన్నిస్ కోర్ట్ హాలు ప్రారంభించిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్...**

**భద్రాచలం, డిసెంబర్ 3. ( మన వార్త ప్రతినిధి).** చెవిటి, మూగ, వికలాంగుల చిన్నారులు తల్లిదండ్రుల దూరంగా ఉన్నప్పటికీ పరస్పరం ఆనందాన్ని పంచుకుంటూ విద్యాభ్యాసం చేస్తుండటం ఆనందకరమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. మంగళవారం రాత్రి తన జీవిత భాగస్వామి పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని వికాసం పాఠశాల సందర్శించిన ఆయన దంపతులు పిల్లలతో కలిసి కేకు కట్ చేసి సరదాగా గడిపారు. అనంతరం పాఠశాలలో నిర్మించిన టెన్నిస్ కోర్ట్ హాలు ప్రారంభించి, దాదాపు 70 వేల రూపాయల విలువైన క్రీడా సామగ్రిని పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, వికలాంగ చిన్నారులు తమకు నచ్చిన ఆటలలో పాల్గొని క్రీడలలో నిపుణులుగా ఎదగాలని సూచించారు. చలికాలం నేపథ్యంలో పిల్లల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తసుకోవాలని, ప్రతి చిన్నారి అభివృద్ధి కోసం తల్లిదండ్రుల్లా మమకారంతో ఉండాలని ఉపదేశించారు. దృష్టిలోపం, వినికిడి లోపం ఉన్న చిన్నారులకు విద్యతోపాటు క్రీడలలో పాల్గొనే అవకాశాలు కల్పించినందుకు ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందించారు. చిన్నారులు ఉపాధ్యాయుల సహాయంతో సైగల ద్వారా చేసిన నృత్యాలను వీక్షించిన రాహుల్ ఆనందం వ్యక్తం చేశారు. తీరిక వచ్చినప్పుడల్లా వికాసం పాఠశాలను సందర్శించి పిల్లలతో సమయం గడుపుతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, డీఈ హరీష్, క్రీడా అధికారి గోపాలరావు, ఏపీఓ పవర్ వేణు, పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న కుమారి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, ప్రియాంక, అరుణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



## గోల్స్తో ముందుకు సాగితేనే చదువుకు సార్థకత: ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ ఐ.ఏ.ఎస్.

**-బీఈడీ కళాశాలలో మూడు లక్షల రూపాయల వ్యయంతో వాటర్ ప్లాంట్ ప్రారంభం...**

**-గిరిజన ప్రాంతాలకి నాణ్యమైన ఉపాధ్యాయులు కావాలని విద్యార్థినిలకు పిలుపునిచ్చిన ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి...**

**-బీఈడీ విద్యార్థినిలకు టెట్, డీఎస్సీ కోచింగ్కు చర్యలు...**

**-సేవా దృక్పథంతో బీఈడీ కళాశాలకు వాటర్ ప్లాంట్ అందించిన ఐటీసీ పేపర్ బోర్డు...**

**-గిరిజన విద్యాభివృద్ధికి బీఈడీ కళాశాల కీలకం: ఐటిడిఏ పి.ఓ వ్యాఖ్య...**

**భద్రాచలం, డిసెంబర్ 3. ( మన వార్త ప్రతినిధి ).** ఉపాధ్యాయ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినిలు వాస్తవాలను తెలుసుకొని మంచి ఉపాధ్యాయులుగా గిరిజన సమాజానికి సేవ చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. బుధవారం నాడు భద్రాచలం బీఈడీ కళాశాలలో ఐటీసీ పేపర్ బోర్డు సహకారంతో మూడు లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో విద్యార్థినిలకు లభిస్తున్న సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థినిలు ఎంచుకున్న జీవిత లక్ష్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థినిల క్రమశిక్షణ, జీవిత లక్ష్యంపై చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు. పోటీ పరీక్షల పుస్తకాలు, వనరులు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, టెట్, డీఎస్సీ కోచింగ్ అందించేందుకు కళాశాల స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. విద్యార్థినిలు సమయపాలీతో చదివి పరీక్షల్లో రాణించడం ద్వారా తమ తల్లిదండ్రులు, అధ్యాపకులు, గ్రామానికి గౌరవాన్ని తీసుకురావాలని ఆయన సూచించారు. బీఈడీ కళాశాలకు సేవా దృక్పథంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన ఐటీసీ పేపర్ బోర్డుకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, కళాశాల ప్రిన్సిపాల్ డా. వీరా నాయక్, డీ.ఎడ్. కళాశాల ప్రిన్సిపాల్ భవాని, ఐటీసీ పేపర్ బోర్డు ఉన్నతాధికారి చంగల్ రావు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



## భద్రాచలంలో బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ ప్రచార వేగం పెంచారు

**-విజయంపై నమ్మకంతో మానే ముందుకు....**

**-బిఆర్ఎస్ సిపిఎం జిడిపి ఆదివాసి జేఏసీ కూటమి మేనిఫెస్టో ప్రకారం భద్రాచలం అభివృద్ధి మానే....**

**భద్రాచలం, డిసెంబర్ 3. ( మన వార్త ప్రతినిధి ).** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భద్రాచలంలో బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ ప్రచారంలో దూకుడు పెంచారు. విజయాన్ని ఏకైక లక్ష్యంగా పెట్టుకుని ఇంటింటా తిరుగుతూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. సీపీఎం మరియు జిడిపి పార్టీల మద్దతుతో ఎన్నికల బరిలో ఉన్న రామకృష్ణ, భద్రాచల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, పరిష్కార మార్గాలు వివరించారు."నాలో ఉన్న అభివృద్ధి పట్ల నిబద్ధతను గుర్తించి, భద్రాచల ప్రజలు ఒక్కసారిగా ఒక త్రాటిపైకి వచ్చి నన్ను గెలిపించాలి. భద్రాచల అభివృద్ధిలో భాగస్వాములైందుకు ప్రతి ఓటరు ముందుకు రావాలి" అని రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగించారు.



## కొత్తగూడెం రైల్వే స్టేషన్ లో పేలిన నాటు బాంబు




**-అడవి జంతువుల వేటకు ఉద్దేశించిన నాటు బాంబు ప్రమాదంలో కుక్క మృతి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయొద్దు: ఎస్పీ రోహిత్ రాజ్, ఐ.పి.ఎస్ సూచన...**

**కొత్తగూడెం, డిసెంబర్ 3( మన వార్త ప్రతినిధి).** కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే ట్రాక్ సమీపంలో జరిగిన ఒక ప్రమాదంలో కుక్క దుర్మరణం చెందింది. చెత్తలో పడేసిన ఉల్లిగడ్డ ఆకారంలో ఉన్న నాటు బాంబును తినే పదార్థమని భావించి ఒక కుక్క కొరికింది. ఆ బాంబు వెంటనే పేలడంతో కుక్క అక్కడికక్కడే మృతి చెందిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. ఈ నాటు బాంబులు అడవి జంతువులను వేటాడటానికి తయారు చేసినవిగా పోలీసులు నిర్ధారించారు. ఘటనపై విచారణ చేపట్టి, వాటిని చెత్తలో పడేసినవారిని గుర్తించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పీ వివరించారు. ఈ సంఘటనలో మరే విధమైన కోణం లేనందున సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయరాదని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారని, ప్రజలు నిర్ధారణ లేని సమాచారం పంచకూడదని సూచించారు.

## ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా అవగాహన పోటీలు నిర్వహణ

**భద్రాద్రి కొతగూడెం, బూర్గంపాడు. డిసెంబర్ 3. ( మన వార్త ప్రతినిధి ).** బూర్గంపాడు బాలికల గురుకుల పాఠశాల మరియు కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా సెక్యూర్ స్వచ్ఛంద సంస్థ (టార్గెట్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్ట్) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి పై అవగాహన కల్పిస్తూ, హెచ్ఐవి ఎలా వ్యాపిస్తుందో, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే ప్రభుత్వం అందిస్తున్న చికిత్సా సదుపాయాల గురించి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలన్న ఉద్దేశ్యంతో ముగ్గుల పోటీలు మరియు వ్యాసరచన పోటీలను కూడా నిర్వహించారు. వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ హరిత ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు యువతలో సరైన జ్ఞానాన్ని పెంపొందించడంలో ఎంతో కీలకమని తెలిపారు. సెక్యూర్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ హరికృష్ణ మాట్లాడుతూ, ఎయిడ్స్ విషయంలో సమాజం కలిగి ఉన్న అపోహలను తొలగించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎన్ఎమ్ పద్మ, ఔట్ రీచ్ వర్కర్లు వసంత, వరలక్ష్మి, సంధ్య, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



## నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఇంచార్జి కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల, మన వార్త డిసెంబర్ – 03** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట్ గ్రామ పంచాయతీ మూడో విడత ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని ఆర్ఓ కేంద్రంలో



నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. నామినేషన్ తోపాటు అభ్యర్థి నూతన బ్యాంక్ ఖాతా కచ్చితంగా ఉండాలని, అన్ని వివరాలు నింపాలని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించిన తరువాత వారితో ఎన్నికల నియమావళి, వ్యయం వివరాల అందజేతపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం హెల్ప్ డెస్క్ పరిశీలించి, అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. కేజీ టూ పీజీ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో తరగతి గదిలో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం మెనూపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి రెడ్డి, ఇంచార్జి ఎంపీడీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఆత్మస్థైర్యం తో ముందుకు వెళ్లాలి

**–త్వరలో యూడీఐడీ కేంద్రం సేవలు అందుబాటులోకి....**
**–ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.....**
**–ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం....**
**–ఆటల పోటీల నిర్వహణ....**
**–బ్యాంక్ లింకేజ్ రుణాల అందజేత....**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త డిసెంబర్ – 03** దివ్యాంగులు ఆత్మస్థైర్యం తో ముందుకు వెళ్లాలని




ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆటల పోటీల కార్యక్రమం బుధవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని, ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. దివ్యాంగులు అందరితో పాటు చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో సెర్ప్ ఆధ్వర్యంలో త్వరలో యూడీఐడీ కేంద్రం అందుబాటులోకి రానున్నదని తెలిపారు. దానిలో పూర్తిస్థాయిలో సేవలు అందుతాయని పేర్కొన్నారు. డే కేర్ సెంటర్ సేవలు సైతం త్వరగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. రెగ్యులర్ గా శిబిరాలు నిర్వహిస్తూ అలింకో ద్వారా సహాయ ఉపకరణాలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం సిరిసిల్ల పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీ వికలాంగుల సంఘానికి ఎస్ బీ ఐ ఆధ్వర్యంలో రూ. 8 లక్షల బ్యాంక్ లింకేజ్ రుణం పత్రాన్ని ఆ సంఘం బాధ్యులకు ఇంచార్జి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల శిక్షణా ఏర్పాట్లను పరిశీలించిన పరిశీలకుడు సర్వేశ్వర్ రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం. డిసెంబర్ 3. ( మన వార్త ప్రతినిధి ).** గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల పర్యవేక్షణకు నియమితులైన సాధారణ పరిశీలకుడు వి. సర్వేశ్వర్ రెడ్డి బుధవారం జిల్లాలోని పలు మండలాలను



సందర్శించి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియలో ఏ చిన్న లోపం చోటు చేసుకోకుండా అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. మొదటగా పాల్వంచ మండలంలోని అనుబోస్ కాలేజీలో నిర్వహించిన ఆర్వోలు, ఏ.ఆర్.ఓ.ల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. శిక్షకులు ఇస్తున్న మార్గదర్శకాలు, శిక్షణా పాఠ్యాంశాలు, హాజరు రికార్డులు, మౌలిక వసతుల పరిస్థితిని వివరంగా తనిఖీ చేశారు. తదుపరి బర్గంపహాడ్ మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల, భద్రాచలం మండల రైతు వేదికలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ రోజున చేపట్టాల్సిన విధులు వంటి అంశాలపై సిబ్బందికి ఇవ్వబడుతున్న శిక్షణ నాణ్యతను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వి. సర్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ "గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులుగా ఉంటాయి. ప్రతి ఎన్నికల అధికారి చట్టబద్ధంగా వారికి కేటాయించిన విధులను పూర్తి జాగ్రత్తతో నిర్వహించాలి. చిన్న తప్పిదం కూడా ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయే అవకాశముండటంతో ప్రతి చర్యలో పారదర్శకత్వం, జాగ్రత్త అవసరం" అని అన్నారు. తదుపరి ఆయన లక్ష్మీదేవిపల్లి, శ్రీనగర్ కాలనీ, సీతంపేట బంజారా, సర్వారం గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ, రికార్డు నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది హాజరు, క్యూలైన్ వ్యవస్థ వంటి అంశాలను పరిశీలించి, నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధమైందని పరిశీలకుడు తెలిపారు. ఈ సందర్శనలో ఎన్నికల శాఖ అధికారులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సీఎం బహిరంగ సభ నేపథ్యంలో ప్రతి పక్ష నేతల ముందస్తు అరెస్టులు




**బెజ్జంకి, డిసెంబర్ 3(మన వార్త రిపోర్టర్ )**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుస్నాబాద్ లో నిర్వహిస్తున్న బహిరంగ సభ నేపథ్యంలో పోలీస్ శాఖ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు వ్యతిరేకంగా ఆందోళనలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని సమాచారం మేరకు బెజ్జంకి పోలీసులు పలువురు నాయకులను ముందుగానే అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో రాష్ట్ర కిసాన్ సెల్ నాయకులు కరివేద మహిపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కరివేద మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పార్లమెంట్ లో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలి

**–జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన...**

**మంచిర్యాల, డిసెంబర్ 03 (మన వార్త ప్రతినిధి):**పార్లమెంట్ సమావేశాలలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభలలో




బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న బీసీలకు చట్టసభలలో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమన్నారు. దేశ జనాభాలో 10 శాతం లేని అగ్రకులాలే దేశాన్ని, రాష్ట్రాన్ని 79 సంవత్సరాలుగా పాలిస్తున్నారని, దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు పాలించబడుతున్నారని, ఇదేనా ప్రజాస్వామ్యం, ఇదేనా సామాజిక న్యాయం అని ప్రశ్నించారు. పార్లమెంట్ లో ప్రాతినిధ్యం వహిస్తున్న 36 రాజకీయ పార్టీల నుండి 32 పార్టీలు బీసీ రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా ఉన్నాయని, 9 రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపినప్పటికీ బీసీ బిల్లు ఎందుకు ప్రవేశపెట్టడం లేదో బిజెపి ప్రభుత్వం బీసీ సమాజానికి చెప్పవలసిన అవసరం ఉందని అన్నారు. గత 40 సంవత్సరాలు చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమాలు నడుస్తున్నప్పటికీ తమ ప్రజాస్వామ్య వాటాకై ఉద్యమం చేస్తున్నప్పటికీ తమ డిమాండ్ ను గత కాంగ్రెస్ ప్రభుత్వంగాని ఇప్పుడు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గాని పెడచెవిన పెట్టడం అంటే ఇది పూర్తిగా బీసీల పట్ల వివక్షగా భావిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యం సుస్థిరంగా ఉండాలంటే ఎవరి జనాభా ఎంతో వారి వాటా అంతా ఉండాలని అన్నారు. ఇప్పటికైనా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఇప్పుడు జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ అంశాన్ని బీసీ సమాజం దృష్టికి తీసుకెళ్లి బీసీ సమాజం ముందు బిజెపిని దోషిగా నిలబడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, బీసీ నాయకులు గజల్లి వెంకటయ్య, షాకపూరి భీమ్ సేన్, ఆరెందుల రాజేశం. అంకం సతీష్, చలిమల అంజయ్య, పెద్దపల్లి సూరయ్య, రాజన్న చారి, శెట్టిపల్లి గట్టయ్య, ధర్మాజీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ పత్రాలను నిబంధనలకు లోబడి పరిశీలించాలి

**–జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్...**

**మంచిర్యాల, డిసెంబర్ 03 (మన వార్త ప్రతినిధి):**రాష్ట్రంలో రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో నామినేషన్



పత్రాలను నిబంధనలకు లోబడి పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం బూదకుర్ద్, చాకేపల్లి గ్రామాలకు బూదకుర్ద్ గ్రామపంచాయతీలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నామినేషన్లు పరిశీలించి అర్హులు, అనర్హుల జాబితా పూర్తి వివరాలతో రూపొందించాలని తెలిపారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులో జాగ్రత్త వహించాలని, విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. అంతకు ముందు బెల్లంపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యాలయం పరిధిలో చేపట్టిన అదనపు గదుల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం విద్యాసంస్థలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ఉల్లంఘనపై డీఈవో చర్యలు తీసుకోవాలని పివైఎల్ డిమాండ్



**భద్రాద్రి కొత్తగూడెం, చర్ల, డిసెంబర్ 03. ( మన వార్త ప్రతినిధి ).**మెనూ ప్రకారం వారానికి మూడు గుడ్లు పెట్టాలి కానీ గత నెల రోజులుగా అసలు గుడ్డే పెట్టడం లేదని చర్ల గర్ల్స్ హైస్కూల్లో మెనూ ప్రకారం గత నెల రోజుల నుండి గుడ్డు పెట్టడం లేదని వారానికి మూడు గుడ్లు పెట్టాలి ఎందుకు పెట్టడం లేదని అన్నంలో పురుగులు వస్తున్నా, హెచ్ ఎం ఎందుకు పట్టించుకోవడంలేదని పి వై ఎల్ జిల్లా ఉపాధ్యక్షులు ముసలి సతీష్ మండిపడ్డారు. చర్ల గర్ల్స్ హై స్కూల్ ని బుధవారం పివైఎల్,యువజన సంగం పిడిఎస్యు విద్యార్థి సంగం సందర్శించి విద్యార్థినీలతో మాట్లాడితే గత నెల రోజులుగా గుడ్డు పెట్టడం లేదని అన్నంలో పురుగులు వస్తున్నాయని కూరలు పచ్చి పచ్చి వాసన వస్తున్నాయని, నీళ్ళు చారు పోస్తున్నారని విద్యార్థినీలు





ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పి వై యల్ ప్రగతిశీల యువజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ ముసలి సతీష్ మాట్లాడుతూ అన్నంలో పురుగులు వస్తున్న టీచర్స్ పట్టించుకోవడంలేదని విద్యార్థినీలు హెచ్ఎం కి ఎన్నిసార్లు తెలియజేసిన కంప్లైంట్ చేసిన పట్టించుకోవడం లేదని తక్షణమే గర్ల్స్ హై స్కూల్ హెచ్ఎం, పీడీ పై చర్యలు తీసుకోవాలని పి వై ఎల్ పి డి ఎస్ యు గా డిమాండ్ చేస్తున్నాం ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి బంగారు భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వాలు పాలకులు చెపుతున్నారు కానీ పాఠశాలలో చుస్తే పురుగుల అన్నం పెడుతున్నారు మెనూ ప్రకారం అసలు గుడ్లు పెట్టడం లేదు అది పెడుతున్నామ్ ఇది పెడుతున్నామని విద్యార్థినిలను మోసం చేస్తున్నారని తీవ్ర అశ్వాస్తతకు గురవుతున్నారని తక్షణమే డీఈవో చర్యలు తీసుకోవాలని ఎంఈఓ పర్యవేక్షణలో లోపం ఉన్నదని అన్నారు. తక్షణమే విద్యార్థులకు మెనూ ప్రకారం గుడ్లు ఆకుకూరలు వారానికి మూడుసార్లు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం లేనియెడల విద్యార్థులందరిని ఐక్యం చేసుకొని ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరిస్తున్నాం అన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



**పెబ్బేరు.డిసెంబర్ 03( మన వార్త ప్రతినిధి)**పెబ్బేరు పట్టణలోని ఈ రోజు వికలాంగుల పునరావాస కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పెబ్బేరు మండల ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు ఎం.డి ఆఫ్రోజ్ వికలాంగులకు శాలువా తో సన్మానించి అంతర్జాతీయ దివ్యాంగుల శుభాకాంక్షలు తెలియజేశారుఆఫ్రోజ్ మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికి తప్ప మనసుకు కాదని ప్రతి ఒక్కరు ఆత్మవిశ్వాసం తో ముందుకు వెళ్లాలని సమాజంలో ప్రతి ఒక్కరు దివ్యాంగుల ను గౌరవించాలని సూచించారు ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల ఎంఐఎంపార్టీ జనరల్ సెక్రెటరీ అమెర్,జాయిర్ సెక్రటరీ మస్తాన్,జి వెంకట రాములు శైలజ చౌడమ్మ శివ శంకర్ ఎంఐఎం పార్టీ నాయకులు హాజీ, మసూమ్, మునీర్, తదితరులు పాల్గొన్నారు

## గ్రామంలో వేడెక్కిన రాజకీయం సర్పంచ్ పదవికి తండ్రి కొడుకుల మధ్య పోటీ...



**రామాయంపేట డిసెంబర్ 4( మన వార్త ప్రతినిధి)** రామయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది సర్పంచ్ పదవికి తండ్రి కొడుకుల మధ్య పోటీ నెలకొంది, గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలకు నగారా మోగడంతో ఎన్నో సంవత్సరం నుంచి ఎదురుచూస్తున్న ఆశవాదులకు ఇది ఒక సువర్ణ అవకాశం అని చెప్పుకోవచ్చు అయితే ఒకే కుటుంబం నుంచి తండ్రి కొడుకులు పోటీ చేయడం చర్చనీయాంశంగా మారింది, ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన తండ్రి మానెగళ్ల రామకృష్ణయ్య అంటే తెలియని వారు ఉండరు ఆయన ఒక ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, తన కుమారుడు వెంకటేష్ కూడా నామినేషన్లు దాఖలు చేశారు, ఒకే కుటుంబం నుండి తండ్రి కొడుకులు సర్పంచ్ పదవికి నామినేషన్ వేయడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది, గ్రామంలో 1563 మంది ఓటర్లు ఉన్న సర్పంచ్ స్థానానికి పది మంది నామినేషన్ దాఖలు చేశారు నేటితో స్క్రూటీనీలు పూర్తికాగా చివరి వరకు తండ్రి కొడుకులు పోటీలో ఉంటారా ఎవరైనా ఒకరు పోటీలో ఉండి మరొకరు ఉపసంహరించుకుంటారా అనే విషయంపై వేచి చూడాల్సి ఉంది.

## నామినేషన్ పత్రాల పరిశీలనలో జాగ్రత్త వహించాలి

**-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్...**

**మంచిర్యాల, డిసెంబర్ 03 (మన వార్త ప్రతినిధి):** రాష్ట్రంలో రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో నామినేషన్ పత్రాల పరిశీలనలో జాగ్రత్త వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని కన్నెపల్లి మండలం జనకాపూర్ గ్రామపంచాయతీలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నామినేషన్లు పరిశీలించి అర్హులు, అనర్హుల జాబితా పూర్తి వివరాలతో రూపొందించాలని తెలిపారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులో జాగ్రత్త వహించాలని, విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను మండల తహసిల్దార్ రామ్ చందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ లతో కలిసి సందర్శించారు. ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని, ఈ క్రమంలో పనులు త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## సర్పంచ్ అభ్యర్థి పై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు



**వెంకటాపూర్ రామప్ప డిసెంబర్3 మన వార్త ప్రతినిధి** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా వెంకటాపూర్ మండలంలో రెండో విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగిన విషయం తెలిసిందే. కాగా, బుధవారం వెంకటాపూర్ మండలంలో ఎన్నికల అధికారులు స్క్రూటీని కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన భాషబోయిన పోషాలు సర్పంచ్ అభ్యర్థి గా తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. నామినేషన్ పత్రాల్లో ఎన్నికల నియమాల ప్రకారం స్థిర ఆస్తుల, నేర చరిత్ర ను సెల్ఫ్ అఫడవిట్ లో తెలియజేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా తన నేర చరిత్ర ను గోప్యత పాటించాడు. ఆ విషయం తెలుసుకున్న మిగతా సర్పంచ్ అభ్యర్థులు బుధవారం వెంకటాపూర్ మండల కేంద్రం చేరుకొని పోషాలు పై లిఖితపూర్వకంగా R O కి ఫిర్యాదు చేయడంతో పాటు ఆయన చరిత్రకు సంబంధించిన పూర్తి ఆధారాలను అందజేశారు. అయినప్పటికీ సంబంధిత ఎన్నికల అధికారులు అదేమీ పెద్ద నేరం కాదన్నట్టుగా నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నామినేషన్ పత్రంలో తన నేరచరిత్రను పొందుపరచక పోవడం నేరమని ఎన్నికల నియమాలి ప్రకారంగా ఎన్నికల సంఘం అధికారులను తప్పుదోవ పట్టించడమేనని పేర్కొన్నారు. అయినప్పటికీ ఎన్నికల అధికారులు పోశాలుకు ఎందుకు మద్దతిస్తున్నారో అర్థం కావడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఆర్వో ఈ అంశంపై చర్యలు తీసుకోకపోతే ఆర్డీవో తో పాటు జిల్లా కలెక్టర్ ను కలవనున్నట్లు వారు వెల్లడించారు. అవసరమైతే ఈ అంశంపై కోర్టుకు కూడా పోయేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మిగతా సర్పంచ్ అభ్యర్థులు పేర్కొంటున్నారు. వాస్తవానికి ఒక అభ్యర్థి పై ఎలిగేషన్ వచ్చిందంటే మండల స్థాయి అధికారి ఎంపిడిఓ తో పాటు స్థానిక ఎస్సై పిలిపించి సదరు అభ్యర్థి నేర చరిత్రకు సంబంధించిన వివరాలను సేకరించాల్సి ఉంటుందని అలా కాకుండా ఎన్నికల అధికారులు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వారు వెల్లడించారు. ఆరోపణ నేపథ్యంలో సదురు అభ్యర్థి ఎలాంటి కేసులు లేవని సర్టిఫికెట్ తీసుకురావాల్సి ఉంటుందని అలాంటిదేమీ చెప్పకుండా తాత్సారం చేయడం సరికాదని వారు మండిపడ్డారు. ఏదేమైనా వెంకటాపూర్ మండలంలో ఈ అంశం బుధవారం చర్చనీయాంశంగా మారింది. సర్పంచ్ అభ్యర్థి పోశాలు పై రేగొండ, ఘనపూర్, హసన్ పర్తి, కేయూ, ఎనమాముల పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయని, పలుమార్లు జైలుకు సైతం పోయి వచ్చాడని తోటి అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

## ఆశయ సాధనకు అంగ వైకల్యం అడ్డుకాదు




**జహీరాబాద్, డిసెంబర్ 3 (మన వార్త):** ఆశయ సాధనకు అంగ వైకల్యం అడ్డు కాదని శ్రీ మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు మారెల్లి వెంకటయ్య ను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. అనంతరం వెంకటయ్య మాట్లాడుతూ వికలాంగులు అధైర్య పడకుండా తాము ఎంచుకున్న లక్ష్యాల వైపు అడుగులు వేయాలని, ఆత్మస్థైర్యంతో ఆశయ సాధనకు కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వికలాంగ విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, నాగలక్ష్మి, శివశంకర్, నరసింహులు, మాణిక్యమ్మ, సువర్ణ రాజేశ్వరి, అనిత, స్వరూప, మందాకిని, సోని, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ దత్త పౌర్ణమి 12వ వార్షికోత్సవ వేడుకలు

### విజయవంతం చేయండి: గురూజీ డాక్టర్ శ్రీ దేవదాస్ స్వామి



**బోయినపల్లి మండలం డిసెంబర్ 03 ( మన వార్త ప్రతినిధి )** నేడు శ్రీ దత్త పౌర్ణమి 12 వార్షికోత్సవ వేడుకలు బోయినపల్లి మండలం స్తంభంపల్లి సాయిబాబా ఆలయంలో ఘనంగా నిర్వహిస్తున్నామని గురూజీ డాక్టర్ శ్రీశ్రీశ్రీ దేవదాసు స్వామి తెలిపారు ఇట్టి వార్షికోత్సవ వేడుకలకు పీఠాధిపతులు వస్తున్నారని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని మరియు పల్లకి సేవ హెూమం కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని దేవదాసు స్వామి తెలియజేశారు.కావున భక్తులు అందరూ ఈ వార్షికోత్సవ వేడుకల లో పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని స్తంభంపల్లి శ్రీ సాయిబాబా దేవాలయ కమిటీ తెలియజేశారు.

## తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు...



**వెల్దుర్తి డిసెంబర్ 4( మన వార్త ప్రతినిధి)** మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతు నుండి 20వేల రూపాయలు లంచం తీసుకుంటున్న సర్వేయర్ శ్రీనివాస్ తో పాటు ట్రైనీ సర్వేయర్ ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఓ రైతు తనకున్న ఒక ఎకరం 10 గంటల భూమి డిజిటల్ సర్వే చేయాలని మండల సర్వే శ్రీనివాస్ కు దరఖాస్తు చేసుకోగా 20000 రూపాయలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు స్థానిక రైతు నవంబర్ 26 తమ కార్యాలయానికి వచ్చి ఈ విషయంపై ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు డబ్బుల డిమాండ్పై తాము విచారణ జరిపామని నిజమేనని తెలియడంతో బుధవారం ఫిర్యాదు చేసిన రైతు రూపాయలు 20,000 ఇచ్చేందుకు సర్వేయర్ కు ఫోన్ చేయగా స్థానిక ఇండియన్ పెట్రోల్ బంక్ వద్దకు రావాలని సర్వే శ్రీనివాస్ రైతులకు సూచించారు దీంతో డబ్బులను పక్కనే ఉన్న ట్రైన్ సర్వేయర్ గౌరీ శరత్ కుమార్ గౌడ్కు ఇవ్వాలని తెలుపగా రైతు ట్రైన్ సర్వేయర్ కు డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నామని ఆయన తెలిపారు, ఇద్దరిని అదుపులోకి తీసుకొని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విచారించామని డిఎస్పి తెలిపారు ఎవరైనా లంచం అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన అన్నారు పట్టుబడ్డ ఇద్దరిని రిమాండ్కు తరలించినట్లు ఆయన తెలిపారు.

## పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**-రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని...**

**-పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఎన్నికల సంఘం కమిషనర్**

**-హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, జిల్లా ఎన్నికల వ్యయ, సాధారణ పరిశీలకులు...**

**రాజన్న సిరిసిల్ల, మన వార్త డిసెంబర్ 03:** పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని జిల్లాల కలెక్టర్ లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి కుమార్, వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ కుముదిని మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు అందేలా రిటర్నింగ్ అధికారి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న గ్రామీణ ప్రాంతాలలో ఎటువంటి ప్రలోభాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు.నామినేషన్ల గడువు ముగిసిన తర్వాత పోటీ చేసే అభ్యర్థుల గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ల పై ముద్రణ నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని అన్నారు. సింగిల్ నామినేషన్ వచ్చిన గ్రామాలు ఉంటే అండర్ టేకింగ్ తీసుకోవాలని, సర్పంచ్ పదవుల వేలం ప్రక్రియ ఎక్కడ జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఓటర్ స్లిప్పుల పంపిణీకి షెడ్యూలు తయారు చేయాలని, ఓటు ప్రాముఖ్యత పై అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు అవసరమైన మేర అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పోలింగ్ సిబ్బంది శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ,క్రిటికల్ పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరిగిందని అన్నారు. జిల్లాలో 6 అంతర్ జిల్లాల చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ సమావేశంలోహౌడీఆర్డీఓ శేషాద్రి, డీపీఓ షరీఫుద్దీన్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జడ్పీ డిప్యూటీ సీఈఓ గీత, నోడల్ అధికారి నవీన్, ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా శ్రీకాంతచారి వర్ధంతి



**-నివాళులర్పించిన విశ్వకర్మబ్రహ్మణ సంఘ సభ్యులు ...**

**ముస్తాబాద్, వార్త డిసెంబర్ 03** మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి.కాసోజు శ్రీకాంతాచారి 16 వ వర్ధంతిని పట్టణ విశ్వకర్మబ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు.బ్రహ్మంగారి ఆలయ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.వారు మాట్లాడుతూ..శ్రీకాంత్ చారి ఆత్మాహుతితో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసి ఉవ్వెత్తున లేచిందని కొనియాడారు. కార్యక్రమంలో చింతోజీ బాలయ్య, అనిల్,సతీష్,సత్యం,చింతోజీ శ్రీనివాన్,చింతోజీ కిషన్,శంకరాచారి,హన్మయ్య చారి,రవి,చింతోజీ సత్యం, చింతోజీ సంతోష్,వి. శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

### ఏఐటీయూసీ లో చేరిన మెయిన్ వర్క్ షాప్ కాంట్రాక్ట్ కార్మికులు..యూనియన్ కండవాలను కప్పి సాదరంగా స్వాగతించిన ఏఐటియుసి నాయకులు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసెంబర్ 3( మన వార్తా ప్రతినిధి)** సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని మెయిన్ వర్క్ షాప్ లో పనిచేస్తున్న మెకానికల్ సెక్షన్ కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం నాడు ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ లో చేరినారు. ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకట్, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్వి రమణమూర్తి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే డబ్ల్యూ క్రిస్టఫర్ల సమక్షంలో కాంట్రాక్ట్ కార్మికులు ఏఐటియుసి లో చేరినారు.ఈ కార్యక్రమంలో డి లింగమూర్తి, ఏ శ్రీనివాస్, శంకర్, యాదగిరి, అఫ్జల్, భాస్కర్,సందీప్,గోపాల్,వినోద్ కుమార్, రవీందర్,శివకుమార్ తదితరులు పాల్గొని ఏఐటీయూసీ ఖండ వాలను కప్పుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ నిరంతరం కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం, సమస్యల సాధన కోసం పోరాడుతున్న ఏఐటీయూసీ లో కాంట్రాక్ట్ కార్మికులు చేరడం మంచిదని, అందుకు మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లుగా తెలిపారు. భవిష్యత్తులో అందరికీ ఈఎస్ఐ అమల కోసం, వేతనాల పంపుదాల కోసం ఏఐటీయూసీ పోరాడుతుందని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఏఐటియుసి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెయిన్ వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



**రాజన్న సిరిసిల్ల, మన వార్త డిసెంబర్ 03**రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 8వ తరగతి చదువుతున్న గూగులోత్ రాఘవ ఇటీవల జరిగిన ఉమ్మడి కరీంనగర్ జోనల్ స్థాయి అండర్ 14 ఇయర్స్ క్రికెట్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి ఎంపిక కావడం జరిగింది. ఈ నెల 5 వ తేదీ నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటాడాని వ్యాయామ ఉపాధ్యాయుడు దాని నరేష్ తెలిపారు. రాష్ట్ర స్థాయి కి ఎంపికైన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంటి గంగారాం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ఎన్నికల సంఘం నియమాలు తప్పనిసరిగా అమలు చేయాలి...



**–ఎన్నికల సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్...**

**రామాయంపేట డిసెంబర్ 4( మన వార్త (ప్రతినిధి)** రామాయపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని గ్రామపంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్ బుధవారం పరిశీలించారు, నామినేషన్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు ఎలాంటి పొరపాట్లు లేకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు అయ్యేలా చూడాలని ఆమె సూచించారు.

## నూతన కార్మిక చట్టాలు,40 కోట్ల కార్మికులకు ఆదర్శవంతమైన, చారిత్రాత్మకమైన చట్టాలు



**–బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య...**

**మందమర్రి, డిసెంబర్ 03 (మన వార్త ప్రతినిధి):**నూతన కార్మిక చట్టాలు,40 కోట్ల కార్మికులకు ఆదర్శవంతమైన, చారిత్రాత్మకమైన చట్టాలు అని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య తెలిపారు. బుధవారం పట్టణ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారత ప్రభుత్వం 49 కార్మిక చట్టాలను 4 చట్టాలుగా సవరించడం, కార్మిక హక్కుల పరిరక్షణ, సంస్థల సంరక్షణ, పరిశ్రమల ప్రగతి, దేశ అభివృద్ధి, నిర్మాణాత్మకమైన పారదర్శకత కలిగిన ఆదర్శవంతమైన చారిత్రాత్మకమైన చట్టాలను సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ స్వాగతిస్తుందని తెలిపారు. 1930,1950 సంవత్సరాల కాలంలోని పాత చట్టాలను మార్పు చేసిన చట్టాలను పూర్తిగా ఆధునిక, పారదర్శక, ఏకీకృత, కార్మిక–కేంద్ర వ్యవస్థను తీసుకువస్తున్నాయని తెలిపారు. 14 జాతీయ కార్మిక సంస్థల వేదిక అయిన కన్సల్ట్, సంస్కరణలను వికసిత భారత్ 2047 లక్ష్యానికి దారితీసే చారిత్రాత్మక అడుగుగా అభివర్ణిస్తోందని వివరించారు.అసంఘటిత, వలస, గిగ్, ప్లాట్ ఫారమ్, అనధికార రంగాలు దాదాపు 40 కోట్ల మంది కార్మికులు తొలిసారిగా చట్టబద్ధమైన సామాజిక భద్రత వ్యవస్థలోకి రావడం, నూతన చట్టాలను అత్యంత కీలకమైన ప్రయోజనమని అన్నారు. ఎసిక్ తరహా ఆరోగ్య సేవలు, పింఛన్–లింక్డ్ ప్రయోజనాలు, ప్రసూతి రక్షణ, వికలాంగుల సహాయం, కార్మిక భద్రత, వ్యావసాయిక ఆరోగ్యం, భద్రత కమిటీలు, సాంకేతికత ఆధారిత తనిఖీలు, మహిళల కార్మికుల భద్రత వంటి అంశాలపై కోడ్లు తీసుకొచ్చిన మెరుగుదలలు అంతర్జాతీయ ప్రమాణాలకు తగినవని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్య సంస్థలు, కార్మిక సంఘాలు, నిపుణులతో జరిగిన విస్తృత సంప్రదింపుల ఫలితమని,కొన్ని రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే కార్మిక సంఘాలు కార్మికుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కారంపూడి శ్రీనివాసరాజు, కేంద్ర ఉపాధ్యక్షులు, డొనికెల రమేష్, ఏరియా ఉపాధ్యక్షులు, గుర్రం ప్రదీప్ కుమార్, ఏరియా కార్యదర్శి, జోగుల ఉదయ్ కుమార్, వైద్య శ్రీనివాస్, మోత్కూరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**జహీరాబాద్, డిసెంబర్ 3 (మన వార్త):** రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టియుడబ్ల్యూజె సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జహీరాబాద్ డివిజన్ ఇంచార్జ్ సిద్ధన్న పాటిల్, జహీరాబాద్ అధ్యక్షుడు మినహాజ్, జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్ లు ఉమ్మడి ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాదులో జరిగిన మహాధర్నాలో పాల్గొన్న అనంతరం జహీరాబాద్ లో మీడియాకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినా కొత్త అక్రిడేషన్ కార్డులు ఇవ్వడం లేదని, ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించడం లేదని, హెల్త్ కార్డులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. జర్నలిస్టులకు సంబంధించిన కమిటీలను వేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జహీరాబాద్ ప్రెస్ క్లబ్ నాయకులు రాజేష్, బసవరాజ్, అబ్దుల్ హై, జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మహా దివ్య పడిపూజ..



**జమ్మికుంట/ హుజురాబాద్, డిసెంబర్ 03( మన వార్త (ప్రతినిధి):** హుజురాబాద్‌జి మండలంలోని కొత్తపల్లి నాగేంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో మహా దివ్య పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పోరెడ్డి రవీందర్ రెడ్డి 18వ పడి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మోతే తిరుపతి గురుస్వామి, కే వెంకట్రావు, కన్నన్ దురై రాజ్ గురు స్వాముల ఆధ్వర్యంలో పేద పండితులు అవధారుల భాస్కర్ శర్మ, కాట్రపల్లి శ్రీకాంత్ శర్మల మంత్రోచ్ఛారణల మధ్య సాగిన ఈ పడి పూజ వేడుకల్లో హుజురాబాద్ పట్టణం, వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి అయ్యప్ప మాల ధరించిన సుమారు 300 మంది స్వాములు, 200 మంది నానుస్వాములు పాల్గొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని ఆరాధించారు. ప్రముఖ గాయకులు వడ్లకొండ అనిల్ కుమార్, హుజురాబాద్ శివరామకృష్ణ, కొత్తపల్లి రామానంద భజన మండలిల ఆధ్వర్యంలో భజన కీర్తనలు నిర్వహించగా ఆ ప్రాంతమంతా భక్తి వాతావరణం నెలకొంది.అనంతరం తీర్థప్రసాదాలు, అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమం హుజురాబాద్ పట్టణంలోనీ కొత్తపల్లి గ్రామంలో మొట్టమొదటిసారిగా పెద్ద దివ్య మహా పడిపూజ నిర్వహించగా గ్రామస్తులు భక్తి పరవశ్యంలో మునిగిపోయారు.

## విచ్చల విడిగా ఎర్రరాయి అక్రమ తవ్వకాలు- పట్టించుకోని అధికారులు



**జహీరాబాద్, డిసెంబర్ 3 (మన వార్త):** రాజకీయ నాయకుల, ప్రభుత్వ అధికారుల అండతో కొందరు వ్యాపారులు ఎర్రరాయి అక్రమ తవ్వకాలు జరుపుతూ, చెట్లను నరుకుతూ వాతావరణ కాలుష్యాన్ని పెంచడంతో పాటు, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. జహీరాబాద్ మండల పరిధి ఖాశింపూర్ గ్రామ శివారులో విచ్చల విడిగా ఎర్రరాయి తవ్వకాలు జరుపుతూ, అక్రమ మైనింగ్ కు పాల్పడుతున్నా, స్థానిక బాధ్యత గల ప్రభుత్వ అధికారులు, జిల్లా మైనింగ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. బాధ్యత గల ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ వ్యాపారుల ఆగడాలకు హద్దు లేకుండా పోయిందని, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఎర్రరాయి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని పలువురు సామాజిక ఉద్యమకారులు కోరుతున్నారు.

## పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కార్యచరణ ప్రకారం సెలవులు ఖరారు



**–జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్...**

**మంచిర్యాల, డిసెంబర్ 03 (మన వార్త (ప్రతినిధి)**రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలింగ్ కార్యచరణ ప్రకారం సెలవులు ఖరారు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు పోలింగ్ రోజు ప్రభుత్వ సెలవుగా ప్రకటించడం జరిగిందని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనుకునే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, సేవల అత్యవసరతకు లోబడి ఆ రోజు కార్యాలయానికి ఆలస్యంగా హాజరు కావడం, కార్యాలయం నుండి త్వరగా వెళ్లడం, తక్కువ వ్యవధి గైర్హాజరు విధానాన్ని ఉపయోగించుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ఎన్నికల కోసం ఉపయోగించబోయే ప్రజా భవనాలు, విద్యా సంస్థల భవనాలు, ఇతర భవనాలకు పోలింగ్ రోజు ప్రభుత్వ సెలవు, పోలింగ్ రోజుకు ముందు రోజు స్థానిక సెలవుగా పరిగణించబడుతుందని, దండేపల్లి, హాజీపూర్, జన్నారం, లక్షెట్టిపేట మండలాలకు డిసెంబర్ 10వ తేదీ (పోలింగ్ ముందు రోజు స్థానిక సెలవు దినం), 11వ తేదీ (పోలింగ్ రోజు), బెల్లంపల్లి, భీమిని, కన్నేపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూర్, వేమనపల్లి మండలాలకు డిసెంబర్ 13వ తేదీ (పోలింగ్ ముందు రోజు స్థానిక సెలవు దినం), 14వ తేదీ (పోలింగ్ రోజు), భీమారం, జైపూర్, చెన్నూరు, కోటపల్లి, మందమర్రి మండలాలకు డిసెంబర్ 16వ తేదీ (పోలింగ్ ముందు రోజు స్థానిక సెలవు దినం), 17వ తేదీ (పోలింగ్ రోజు) లలో సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. ప్రకటించిన ప్రాంతాలలోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, సంస్థల ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ రోజు స్థానిక సెలవు ప్రకటించబడిందని తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో ఉన్న సంబంధిత అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, వ్యాపార, పరిశ్రమ యాజమాన్యాలు తమ ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు పై పేర్కొన్న రోజులను వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించాలని తెలిపారు.

# ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి...



**నార్సింగి డిసెంబర్ 4( మన వార్త (ప్రతినిధి)**ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డు రాగా తప్పించ బోయిన వ్యక్తి కి తీవ్ర గాయాలయి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నార్సింగి మండల కేంద్రంలో జరిగింది. స్థానిక ఎస్ఐ బీమరి సృజన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బక్కన్నగారి అంజన్ రెడ్డి (50) తండ్రి నారాయణరెడ్డి ఈ నెల 1వ తేదీన సోమవారం ఉదయం తన స్వంత పని నిమిత్తం తన ద్విచక్ర వాహనం పై చేగుంట కు వెళ్ళి నార్సింగి కి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్డు పై గల మహర్షి విద్యాలయం వద్దకు చేరుకోగా తన బైక్ కు కుక్క అడ్డం వచ్చింది. దానిని తప్పించే క్రమంలో అంజన్ రెడ్డి వాహనం అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలు అయి అపస్మారక స్థితి లోకి వెళ్ళిపోయాడు. ఘటనను గమనించిన కొందరు పక్కనే గల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రి డాక్టర్ సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అంజన్ రెడ్డి అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 2 మంగళవారం రాత్రి 8:30 ప్రాంతంలో మరణించారు. మృతుని భార్య బక్కన్నగారి సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రామాయంపేట ఆసుపత్రిలో పోస్ట్ మార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సృజన తెలిపారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలి: ఎం ఆర్ ఓ రాంబాబు



**మధిర, డిసెంబర్3( మన వార్త)**మండలంలో రెండు సర్పంచ్ లు,32 వార్డు పదవులు ఏకగ్రీవం సర్పంచ్ పదవులకు సర్పంచ్ పోటీ చేసే అభ్యర్థులు మైకు పర్మిషన్ కోసం మీ సేవలో వంద రూపాయలు చలానా చెల్లించి తహసీల్దార్ కార్యాలయంలో అందజేసి పోలీస్ ద్వారా ఎన్వోసీ తీసుకోవాలన్నారు ప్రభుత్వం నుండి వేతనం తీసుకునే ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున 50 వేల రూపాయలు తీసుకువెళ్లొద్దన్నారు. విలేకరుల సమావేశం తహసీల్దార్ రాంబాబు ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సీఐలు రమేష్, మధు,ఎస్ ఐ లక్ష్మి భార్గవి...

# పక్కాగా నామినేషన్ల ప్రక్రియ చేపట్టాలి...



**–పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్...**

**నార్సింగి డిసెంబర్ 4 ( మన వార్త (ప్రతినిధి)** నార్సింగ్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్ బుధవారం సందర్శించారు, ఎలాంటి పొరపాటు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని నామినేషన్లకు సంబంధించిన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏరోజుకారోజు నోటీస్ బోర్డ్ పై ప్రదర్శించాలని జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టర్లు పంపించాలని చెప్పారు, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని అన్నారు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్న ఉన్నత అధికారులను సంప్రదించాలని సూచించారు.

## హిందూ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదు



**–ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం...**

**మందమర్రి, డిసెంబర్ 03 (మన వార్త (ప్రతినిధి):**హిందూ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైనది కాదని బిజెపి పట్టణ అధ్యక్షులు సప్పిడి నరేష్, ఎస్సీ మోర్చా మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రోడ్డ మోహన్ అన్నారు. బుధవారం పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం రోడ్డుపై బాటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సప్పిడి నరేష్, రోడ్డ మోహన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందూ సమాజంపై అనుచిత వ్యాఖ్యలతో దాడి చేయడం తెలంగాణ సమాజం చేసుకున్న దురదృష్టమని, ఆలోచన లేని ముఖ్యమంత్రిని ఎన్నుకున్నందుకు సిగ్గుపడుతున్నామని తెలిపారు. ఒక హిందూ కుటుంబంలో జన్మించి హిందూ దేవుళ్లను అవమానపరిచే విధంగా మాట్లాడడం, హిందూ సమాజంపై దాడి చేయడమని వారి మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి వైయస్ రాజశేఖర్ రెడ్డి హిందువుల ఆరాధ్య దైవం అయినటువంటి వెంకటేశ్వరస్వామికి సంబంధించిన ఏడుకొండల జోలికి పోయినందుకు అతనికి ఏమి జరిగిందో దేశవ్యాప్తంగా ప్రజల అందరికీ తెలుసు కాబట్టి హిందూ దేవుళ్ళ జోలికిపోయి వారి ఆగ్రహానికి గురి కావద్దని హితవు పలికారు. హిందూ సమాజంలో తన కుటుంబం కూడా ఒకటని గ్రహించి ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు బేషరత్ గా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న కాలంలో అనేక హిందూ దేవాలయాలపై దాడి జరిగితే కనీసం స్పందించని ముఖ్యమంత్రి ఎవరి మెప్పు కోసం పనిచేస్తున్నాడో చెప్పాలన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తన పద్ధతి మార్చుకోకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు డివి దీక్షితులు, పట్టణ ఉపాధ్యక్షుడు శెనిగారపు శ్రీనివాస్, తుపాకుల శ్రీనివాస్, గాదె రాములు, పట్టణ కార్యదర్శి దుర్గం సత్యంబాబు, పోషంపెల్లి శేఖర్, కొంతం రాజు, జక్కుల మహేష్, అల్లంల నాగేష్, పోషంపెల్లి శ్యాంసుందర్, శ్రీనివాస్, ప్రవీణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగ అనాథ చిన్నారులకు అల్టిట్యూడ్ విద్యార్థుల సహాయం

**-స్వచ్ఛందంగా 15,216 సహాయం...**

**ఎల్కతుర్తి, డిసెంబర్ 03 మన వార్త ప్రతినిధి**వికలాంగ అనాథ చిన్నారుల అభ్యున్నత కోసం సేవలు అందిస్తున్న ఎస్ఆర్ఎస్ బ్లైండ్ అండ్ డెఫ్ ఖమ్మం సంస్థకు సెయింట్ థామస్ అల్టిట్యూడ్ విద్యార్థులు మానవ దృక్పథంతో 15,216 ఆర్థిక సహాయం అందించారు.స్వచ్ఛంద సేవాస్ఫూర్తితో ముందుకు వచ్చిన విద్యార్థులు తమలోని మానవతా విలువలను ప్రతిబింబిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుష్కారి కార్తీక్ రావు మాట్లాడుతూ, "విద్యార్థులకు ఆటపాటలతో పాటు సేవాభావాన్ని పెంపొందించడం మా ప్రధాన బాధ్యత. అల్టిట్యూడ్ విద్యార్థులు ఎల్లప్పుడూ అద్భుతాలు సాధించడంలో ముందుంటారు. ఈరోజు చేసిన సేవా కార్యక్రమం మా పాఠశాలకు గర్వకారణం" అని పేర్కొన్నారు.ఎస్ఆర్ఎస్ సంస్థకు విద్యార్థులు అందించిన సహాయంపై ఎల్కతుర్తి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వారి సేవాభావాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్, హెడ్‌మాస్టర్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రే తిరుపతి, ఉపాధ్యాయులు సరిత, లావణ్య, ఆశా బేగం, సురేష్, గీత, శ్రావణి, స్వప్న, శ్వేత, అనుష, మమత, కవిత, కావ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన నామినేషన్ ప్రక్రియ నేడు నామినేషన్ల పత్రాలను పరిశీలించిన అధికారులు...



**డిసెంబర్ 03 మన వార్త ప్రతినిది** ఒండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గత మూడు రోజులుగా నిర్వహించిన నామినేషన్ల స్వీకరణ పూర్తి కావడంతో నేడు స్క్రూటిని నిర్వహించారు, మూడు రోజులుగా వేసిన నామినేషన్ పత్రాలను అధికారులు పరిశీలించారు, స్క్రూటీని నిర్వహించిన అనంతరం మండలంలోని 31 గ్రామ పంచాయతీలకు 113 సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు కాగా వార్డు సభ్యులకు సంబంధించిన 615 నామినేషన్లను వచ్చినట్టు అధికారులు తెలిపారు.

## దామెర గ్రామ రాజకీయాల్లో పెద్ద మార్పు...

**-కాంగ్రెస్ మాజీ గ్రామ అధ్యక్షుడు సాతూరి ప్రభాకర్ బీజేపీలో చేరిక....**



**ఎల్కతుర్తి డిసెంబర్ 03 మన వార్త ప్రతినిది**.ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గ్రామ రాజకీయాల్లో కీలక మలుపు తిరిగింది దామెర గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సాతూరి ప్రభాకర్ కేంద్ర అధికార పార్టీ బిజెపిలో చేరడం ద్వారా స్థానిక రాజకీయాల్లో చర్చ నియాంశంగా మారింది. బిజెపి మండల అధ్యక్షుడు మన్నుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి సాతూరి ప్రభాకర్ ను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ అభివృద్ధికి బిజెపి చేస్తున్న కృషి కేంద్రం తీసుకుంటున్న ప్రజా ప్రయోజన కార్యక్రమాలు ఆకట్టుకోవడం వల్లే పార్టీలో చేరానని ప్రభాకర్ ఈ సందర్భంగా తెలిపారు. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిజెపి బలపడేందుకు సాతూరి ప్రభాకర్ చేరిక కీలకంగా మారుతుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. దామెర గ్రామంలో బిజెపి శక్తి విస్తరణకు ఇది పెద్ద సంఘటనగా నాయకులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దామెర శక్తి కేంద్ర ఇన్చార్జి ఠాకూర్ శ్యామ్ సింగ్, మాజీ సర్పంచ్ చల్ల రవీందర్ రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు అంబీర్ శ్రీనివాస్, పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు బాసటగా...



**మల్యాల, డిసెంబర్ 03(మన వార్త ప్రతినిధి)** మల్యాల మండలం కొండగట్టు అగ్ని ప్రమాద ఘటనలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులకు ముత్యంపేట NRI వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారికి బాసటగా నిలవాలని రూ. 15,000 లను అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షులు మర్రి మల్లేశం తెలిపారు. అందజేసిన వారిలో సామల సతీష్, బాలే వంశీకృష్ణ, పంజాల మహేష్, పులి అంజయ్య తదితరులు పాల్గొన్నారు..

## కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఐహెచ్ఐపి పోర్టల్ వినియోగంపై శిక్షణా కార్యక్రమం




**కొత్తగూడెం, డిసెంబర్ 3. ( మన వార్త ప్రతినిధి ).**జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో ప్రైవేటు ఆసుపత్రులు మరియు డయాగ్నస్టిక్ సెంటర్ల వైద్య సిబ్బందికి ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లామ్ పోర్టల్ వినియోగంపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ, ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లామ్ పోర్టల్‌లో సిండ్రామిక్ సర్వైలెన్స్‌కు సంబంధించిన 22 సిండ్రోములు మరియు 33 వ్యాధుల వివరాలను ప్రతిరోజూ సమయానుసారంగా నమోదు చేయాలని వైద్య సిబ్బందిని సూచించారు. అన్ని ప్రైవేటు ఆరోగ్య సంస్థలు ఈ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు.ఆయన అలాగే క్లినికల్ ఇష్టబ్లిష్మెంట్ యాక్ట్, పీసీపీఎండిటి యాక్ట్, మ్ టి పి యాక్ట్ అమలు విధానాలపై వివరాలు తెలియజేశారు. జిల్లాలో సిజేరియన్ శస్త్రచికిత్సల శాతం తగ్గించే చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిమ్ హెచ్ ఓ డాక్టర్ జయలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పుల్లారెడ్డి, ఎపిడమాలజిస్ట్ ఇమ్మాన్యుయేల్, శ్రీను, ఏ మ్ ఓ కుమారస్వామి, అలాగే వివిధ ప్రైవేట్ ఆసుపత్రులు మరియు ల్యాబ్‌ల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## మానసిక సమస్యలతో వివాహిత ఆత్మహత్య...

**ఇల్లంతకుంట,డిసెంబర్ 03 ( మన వార్త ప్రతినిధి)**ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామంలో మంగళవారం సాయంత్రం విషాదకర సంఘటన చోటు చేసుకుంది.గ్రామానికి చెందిన కుమ్మరవేణి లత (28) కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.భర్త నాగరాజు వ్యవసాయ పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో,లత తాడుతో ఫ్యాన్‌కు ఉరివేసి ఆత్మహత్యకు పాల్పడింది.ఈ సంఘటనపై మృతురాలి తల్లి పసుపుల లక్ష్మి ఫిర్యాదు చేశారు.ఆ ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై సిరిసిల్ల అశోక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.మృతురాలికి 5 సంవత్సరాల వయస్సున్న కుమారుడు ఉన్నట్లు ధృవీకరించారు.

## నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా,నిబంధనల ప్రకారం నిర్వహించాలి...



**-వనపర్తి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్...**

**పెబ్బేరు.డిసెంబర్03 (మన వార్త ప్రతినిధి)**గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎంతో పారదర్శకంగా,నిబంధనల ప్రకారం నిర్వహించాలని వనపర్తి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు.బుధవారం అదనపు కలెక్టర్ పెబ్బేరు మండలంలోని రంగాపూర్, సూగూరు,జనుంపల్లి మరియు శాఖాపురం క్లస్టర్లను సందర్శించి నామినేషన్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా క్లస్టర్ల రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. నామినేషన్లను స్వీకరించే ప్రక్రియ పూర్తయిన వెంటనే, నిర్ణీత గడువులోగా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు.నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి అవసరమైన సమాచారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన 'హెల్ప్ డెస్క్' సేవలను నాణ్యతతో నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.పెబ్బేరు తహసీల్దార్ మురళి, క్లస్టర్ల రిటర్నింగ్ అధికారులు, స్థానిక రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మరియు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ నేతృత్వంలో

# పట్టణానికి నూతన కళ...



**-వేములవాడ అభివృద్ధికి వేగం...**

**-ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ నేతృత్వంలో పట్టణానికి కొత్త రూపు...**

**-ప్రజల నోట ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అభివృద్ధి మాట...**

**వేములవాడ డిసెంబర్ 03 ( మన వార్త ప్రతినిధి )** వేములవాడ పట్టణం అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ముందుండి పలు కీలక ప్రాజెక్టులను ప్రారంభించి శరవేగంగా పనులు చేయిస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆయన చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు పట్టణానికి నూతన కళ, కొత్త చైతన్యాన్ని తీసుకొస్తున్నాయి.ప్రధాన అభివృద్ధి పనులలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి, రోడ్ల విస్తరణ డబుల్ లేయర్ బ్లాక్‌టాప్ రోడ్ల పనులు వేగంగా ముందుకు సాగుతోంది. పట్టణంలోని ప్రధాన రహదారులను ఆధునీకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ప్రజల నోట వినిపిస్తూ, కనిపిస్తుంది. ఈ అభివృద్ధి వల్ల రానున్న రోజులలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు సౌకర్యం ప్రజలకు ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.అదేవిదంగా డ్రైనేజ్ %డ% శానిటేషన్ పనుల వేగవంతం: వరదల సమస్యలను నివారించడానికి కొత్త డ్రెయినేజీలు, పాత కాల్వల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి.ప్రజల అభినందనలు అభివృద్ధి కార్యక్రమాపై ప్రజల నుంచి విశేషమైన స్పందనను పొందుతున్నారు. పట్టణం దీర్ఘకాలిక అభివృద్ధికి ఇది మైలురాయిగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యే అది శ్రీనివాస్ హామీ "వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఒక ఆదర్శ పట్టణంగా నిలిపే దిశగా ముందుకు కృషి కొనసాగుతుంది" అని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ తెలిపారని అదేవిధంగా చేసి చూపిస్తున్నారని స్థానిక ప్రజలు మాట్లాడుతున్నారు. ఇలాంటి అభివృద్ధి పనులు చేయడంతో స్థానిక వేములవాడ ప్రజల మనసులో చిరస్థాయిగా తనదంటూ ముద్ర వేసుకుంటున్నారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. ఇది ప్రజల మనసులో నుండి తెలుసుకొని ప్రచురిస్తున్న విశ్లేషణాత్మకమైన మన వార్త ప్రత్యేక కథనం.



## తిమ్మాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం




**-కారు, ఆటో, బైక్ ఢీ కొట్టిన బొలెరో వాహనం...**

**బెజ్జంకి, డిసెంబర్ 3(మన వార్త రిపోర్టర్ )**కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ముసలాపూర్ వద్ద ఆగి ఉన్న ఆటోను బొలెరో వాహనం బలంగా ఢీ కొట్టింది. ఆ తర్వాత ఆటో, కారును, కారు బైక్ ని ఢీకొట్టి, రోడ్డుపై బొలెరో వాహనం బోల్తా పడింది. ఈ యొక్క సంఘటనలు కొత్తపల్లికి చెందిన ఆటో డ్రైవర్ దుంబాల శ్రీనివాస్ కి గాయాలయ్యాయి. గాయపడిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్ ని స్థానికులు 108 సిబ్బంది కి సమాచారం అందించి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న తిమ్మాపూర్ పోలీసులు బొలెరో డ్రైవర్ మద్యం తాగి నడపడం వల్లే ఈ ప్రమాదం సంబంధించిందని తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తిమ్మాపూర్ పోలీసులు తెలిపారు.

## ముఖ్యమంత్రిని కలిసి నాయకులు..



**జమ్మికుంట, డిసెంబర్ 03( మన వార్త ప్రతినిధి):**ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలసిన జమ్మికుంట నాయకులు బుధవారం హుస్నాబాద్ లో జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి, రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ కో కన్వీనర్ దొంత రమేష్ లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## బెజ్జంకి మండలంలోని ఆయా గ్రామాల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన



**-సర్పంచ్ 1,వార్డు సభ్యులు 38...**

**బెజ్జంకి,డిసెంబర్ 3( మన వార్త రిపోర్టర్ )**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండంల పరిధిలోని గ్రామాలు నరసింహులపల్లి 6 వార్డులు, రామ్ సాగర్ 2,5 , బెజ్జంకి క్రాసింగ్ 1,2,3 , గుగ్గిళ్ళ 6,8 , తిమ్మాయిపల్లి 4 , ముత్తన్నపేట 6,8 , దాచారం 6,7 , చీలాపూర్ 8,5 , గుండారం 2,4,5,6,8 , తలవారనిపల్లి 3,4,6 , పోతారం 3, కళ్ళపల్లి 5,10, చిలాపూర్ పల్లి, 2,3,4,5 , బెజ్జంకి 12, బేగంపేట్ 1, వీరాపూర్ 5, మొత్తం 38 వార్డు మెంబర్లు ఏకగ్రీవం. నరసింహులపల్లి గ్రామ సర్పంచ్ ని గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని బెజ్జంకి ఎంపీడీవో కడివేర్గు ప్రవీణ్ తెలిపారు.

# 3500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



**మంచిర్యాల, డిసెంబర్ 03 (మన వార్త ప్రతినిధి):**జిల్లాలోని వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామంలో పోలీస్, ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి, గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో 21 చోట్ల గుడుంబా తీసేందుకు సిద్ధంగా ఉంచిన సుమారు 3,500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. అనంతరం సిఐ బన్సిలాల్ గ్రామస్తులతో మాట్లాడుతూ, గుడుంబా వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. వేమనపల్లి మండలం గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దాలని గ్రామస్తులను కోరారు. గ్రామంలో గుడుంబా అమ్మిన, తయారు చేసినా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. యువత నీల్వాయి పోలీసుల వెన్నంటి ఉండి, గుడుంబా నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని కోరారు. మండలంలోని గ్రామ యువత, మహిళలు ముందుకు వచ్చి, గ్రామాలలో పూర్తిగా గుడుంబా నిర్మూలన దిశగా పోలీసులకు సహకరించాలన్నారు. ఇకముందు ఎవరైనా గుడుంబా అమ్మిన, తయారు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి, ఎక్సైజ్ అధికారులు, ఇతర పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మూడవ విడత నామినేషన్లు ప్రారంభం..

**జమ్మికుంట, డిసెంబర్ 03( మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట మండలంలో గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికలలో భాగంగా మండలంలోని సర్పంచ్, వార్డ్ సభ్యుల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలోని 20 గ్రామాలకు నామినేషన్ పత్రాలను స్వీకరించడానికి ఆరు క్లస్టర్లను నిర్వహించారు. గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులకు మాచనపల్లి, వావిలాల, మడిపల్లి, బిజీగిరిషరీఫ్, కోరపల్లి, తనుగుల గ్రామాలను క్లస్టర్ కేంద్రాలుగా ఏర్పాటు చేసి నామినేషన్ పత్రాలను స్వీకరించారు.మొదటిరోజు సర్పంచ్ స్థానాలకు 17,వార్డు సభ్యుల స్థానాలకు 62 మంది నామినేషన్లు వేశారు.నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎన్నికల సహాయాధికారి, ఎంపీడీవో పద్మావతి పరిశీలించారు.

# ఆకాశమే స్టేడియం..




**– 5500 అడుగుల ఎత్తులో ఫుట్‌బాల్ మ్యాచ్...**

**న్యూఢిల్లీ,** భూమి నుంచి వేల అడుగుల ఎత్తులో ఫుట్‌బాల్ ఆడితే ఎలా ఉంటుందో ఊహించడమే గొప్ప అనిపిస్తుంది. కానీ రష్యాకు చెందిన అథ్లెట్ సెర్గీ బోయ్‌ట్‌సోవ్ మాత్రం ఆ ఊహను నిజం చేశాడు. సుమారు 5500 అడుగుల ఎత్తులో హాట్ ఎయిర్ బెలూన్ కింద ప్రత్యేకంగా కట్టిన చిన్న మైదానంలో ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడుతూ ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచాడు. గాల్లో వేలాడుతున్న చిన్న ఫ్లోర్‌పై పూర్తి ఫుట్‌బాల్ గేర్‌తో పరుగులు తీస్తున్న ప్లేయర్లు, టాకిల్స్, పాస్‌లు, గోల్స్ భూమిపై ఆడినంత సహజంగా కొనసాగడం చూసి నెటిజన్లు అవాక్కయ్యారు. ఈ అద్భుత దృశ్యాలకు సంబంధించిన వీడియోను బోయ్‌ట్‌సోవ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా అది క్షణాల్లో వైరల్ అయి 44 మిలియన్ వీక్షణలు దాటేసింది.వీడియోలో ఆటగాళ్లందరి వెనుక పారాషూట్ బ్యాగులు కనబడతాయి. గాల్లో తేలియాడే హాట్ ఎయిర్ బెలూన్‌ను తాళ్లతో కట్టిన చిన్నచిన్న ప్రదేశంలోనే వారు చాకచక్యంగా బంతిని కిక్ చేస్తూ, జాగ్రత్తగా బ్యాలెన్స్ చేసుకుంటూ ఆడిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పై నుంచి ఒక విమానం చుట్టూ తిరుగుతూ ఈ అరుదైన సన్నివేశాల్ని కెమెరాలో బంధించగా%ొ% నీలిరంగు ఆకాశం, అందులో మెల్లగా తేలియాడే బెలూన్లు, కదులుతున్న ఆటగాళ్లు కలిసి దృశ్యం ఒక సినిమా ఫ్రేమ్‌లా కనిపించింది.ఈ సాహసాన్ని సాధారణ వినోదంగా కాకుండా ప్రపంచ రికార్డుగానే బోయ్‌ట్‌సోవ్ ప్రకటించాడు. “1,800 మీటర్ల ఎత్తులో ప్రపంచపు తొలి హాట్ ఎయిర్ బెలూన్ ఫుట్‌బాల్ మ్యాచ్” అనే క్యాప్షన్‌తో వీడియోను అప్‌లోడ్ చేయడంతో ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ వీడియోకు ప్రచారం పెరిగేకొద్దీ%ొ% ‘గాల్లో ఫుట్‌బాల్’ అనే కొత్త కాన్సెప్ట్‌పై కూడా ఆసక్తి పెరుగుతోంది.ఇక బోయ్‌ట్‌సోవ్‌కు ఇది మొదటిసారి చేసిన సాహసం కాదు. ఇంతకుముందు కూడా 1,500 మీటర్ల ఎత్తులో ఏరియల్ జిమ్నాస్టిక్స్, బెలూన్ బాక్సింగ్, బెలూన్ టేబుల్ టెన్నిస్‌లాంటి అరుదైన స్పోర్ట్స్ వీడియోలను విడుదల చేసి లక్షలాది వీక్షణలు సంపాదించాడు. కానీ ఈసారి చేసిన ‘ఆకాశ ఫుట్‌బాల్ మ్యాచ్’ మాత్రం అందరి ఊహలకు అందని విజువల్‌గా నిలిచింది. ప్రత్యేకంగాగాల్లో నిలబడి చేసిన రొనాల్డో స్టైల్ ‘సియూ’ సెలబ్రేషన్ నెట్టింట్లో మరింత వైరల్ అవుతోంది.ఈ హై-ఆల్టిట్యూడ్ ఫుట్‌బాల్ భవిష్యత్‌లో కొత్త ట్రెండ్‌గా మారుతుందో లేదో చూడాలి కానీ సెర్గీ బోయ్‌ట్‌సోవ్ మాత్రం ప్రపంచం మొత్తం పైకి చూసేలా తన సాహసాలతో మరోసారి చూపించాడు అనడంలో సంశయం లేదు.

# 16 ఏళ్ల తర్వాత దేశవాళీ మైదానంలోకి కోహ్లీ...



**– విజయ్ హజారే ట్రోఫీలో రీఎంట్రీ...**

**న్యూఢిల్లీ,** భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ మరోసారి దేశవాళీ క్రికెట్ రంగంలో అడుగుపెట్టేందుకు సిద్ధమైనాడు. దాదాపు పదహారేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్‌తో బిజీగా ఉన్న కోహ్లీ, చాలా కాలం తర్వాత మళ్లీ దేశవాళీ మ్యాచ్‌లలో కనిపించబోతున్నాడు. డిసెంబర్ 24 నుండి ప్రారంభమయ్యే విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో ఢిల్లీ జట్టు తరఫున ఆడడానికి కోహ్లీ అంగీకరించాడని ఢిల్లీ జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ వెల్లడించారు.కోహ్లీ అందుబాటును తెలియజేయడంతో ఢిల్లీ జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో కొత్త ఉత్సాహం నిండిపోనుందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అయితే కోహ్లీ మొత్తం ఎంతటి మ్యాచ్‌లు ఆడతాడో అన్న విషయంపై మాత్రం స్పష్టత రావాల్సి ఉంది. చివరిసారిగా కోహ్లీ 2010 ఫిబ్రవరిలో విజయ్ హజారే మ్యాచ్‌లో సర్వీసెస్ జట్టుతో తలపడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నుంచి అంతర్జాతీయ సిరీస్‌లు, ప్రధాన టోర్నీలతో పూర్తిగా బిజీ అయ్యాడు.టెస్టులు, టీ20ల నుండి వైదొలిగిన కోహ్లీ ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి పెట్టిన తరుణంలో తన ఆటతీరును పదును పెట్టుకునేందుకు దేశవాళీ క్రికెట్‌ను ఎంచుకున్నాడని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. బీసీసీఐ తాజాగా తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం జాతీయ జట్టులో లేని కాంట్రాక్ట్ ఆటగాళ్లు తప్పనిసరిగా దేశవాళీ క్రికెట్‌లో పాల్గొనాలనే నిబంధన కూడా కోహ్లీ నిర్ణయంపై ప్రభావం చూపినట్లు సమాచారం.విజయ్ హజారే టోర్నీలో ఢిల్లీ జట్టు తొలిమ్యాచ్ డిసెంబర్ 24న బెంగళూరులో ఆంధ్రప్రదేశ్‌తో జరగనుంది. మొత్తం ఆరు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. ఇదిలా ఉంటే రాంచీలో జరిగిన వన్డేలో దక్షిణాఫ్రికాపై కోహ్లీ 135 పరుగులతో సూపర్ సెంచరీ బాదాడు. ఇప్పుడు దేశవాళీ మైదానంలో ఆయన బ్యాటింగ్ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

# చదరంగంలో సంచలనం సృష్టించిన మూడేళ్ల కుర్రాడు



**భోపాల్:** మధ్యప్రదేశ్‌లోని ఒక కుటుంబం తమ చిన్నారి ఫోన్‌కు అతుక్కుపోయిన తీరు చూసి తీవ్రంగా ఆందోళన చెందింది. మూడేండ్ల వయసున్న తమ కుమారుడి చేత మొబైల్‌ను దూరం చేయాలంటే, అతని దృష్టిని మరొక దానిపై నిలిపేలా కొత్త ఆటలను నేర్పించాలని తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. ప్రారంభంలో సాధారణ ఆటలతో మొదలుపెట్టినా, చివరకు చిన్నారి చెస్‌పై చూపిన మెలకువ వారిని ఆశ్చర్యపరిచింది. ఇంట్లోనే కొంతకాలం చెస్ ఆటను నేర్పిన తరువాత, అతని ప్రగతి గుర్తించిన తల్లిదండ్రులు స్థానిక కోచింగ్ సెంటర్‌లో చేర్పించారు. అక్కడ అతడు చూపిన ప్రతిభ మాత్రం అందరినీ విస్మయానికి గురిచేసింది.చాలా తక్కువ సమయంలోనే టాక్టిక్స్, ప్యాటర్న్లు, ప్లానింగ్‌లపై అసాధారణమైన పట్టు సాధించిన ఈ బాలుడు ఇప్పుడు ప్రపంచ రికార్డు స్థాయికి చేరుకున్నాడు. సర్వజ్ఞసింగ్ కుశ్వాహా అనే ఈ చిన్నారి, చెస్ ప్రపంచంలో అరుదైన ఘనత సాధించాడు. కేవలం 3 సంవత్సరాలు 7 నెలలు 20 రోజులు వయసులోనే ఫిడే ర్యాపిడ్ రేటింగ్ 1572 నమోదు చేసి ప్రపంచంలోనే అతి చిన్న వయసులో అధికారిక రేటింగ్ సాధించిన ఆటగాడిగా నిలిచాడు. అంతేకాదు, మూడు అంతర్జాతీయ రేటెడ్ ఆటగాళ్లను వరుసగా ఓడించి అందరినీ ఆశ్చర్యపరిచాడు.స్మార్ట్‌ఫోన్ నుంచి దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో మొదలైన ప్రయాణం ఇలా రికార్డు స్థాయిని సృష్టించడమే కాకుండా, చిన్నారిని అంతర్జాతీయ స్థాయికి చేర్చిందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదివరకూ ఈ రికార్డు పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనీశ్ సర్కార్ పేరుపై ఉండగా, ఇప్పుడు ఆ స్థానాన్ని సర్వజ్ఞసింగ్ దాటి కొత్త చరిత్ర సృష్టించాడు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచిన ఈ బుడ్డోడు భవిష్యత్తులో భారత చదరంగానికి మరిన్ని విజయాలు అందిస్తాడనే నమ్మకం సందడి చేస్తోంది.

## రష్మిక మందన్నా 'థామా' ఓటీటీలో స్ట్రీమింగ్



**న్యూఢిల్లీ,** బాలీవుడ్‌లో వరుసగా 'స్త్రీ', 'భేదియా', 'ముంజ్యా' వంటి హారర్ కామెడీ చిత్రాలను అందించిన మాడ్‌డాక్ ఫిలిమ్స్ నుంచి వచ్చిన తాజా హారర్ యూనివర్స్ చిత్రం 'థామా' దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకున్నది. తాజాగా ఈ చిత్రం డిజిటల్ ప్రీమియర్‌గా ప్రేక్షకులకు అందుబాటులోకి వచ్చింది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో హిందీ, తెలుగు భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. అయితే ఇది ప్రైమ్ రెంటల్ సెక్షన్‌లో మాత్రమే అందుబాటులోఉంది. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నేషనల్ క్రష్ రష్మిక మందన్నా రక్తం తాగే బేతాళురాలు తారిక (తడకా) పాత్రలో నటించి ప్రశంసలు అందుకున్నారు. ఆమెతో పాటు ఆయుష్మాన్ ఖురానా రిపోర్టర్ అలోక్‌గా కనిపించారు. ప్రధాన ప్రతినాయకుడిగా నవాజుద్దీన్ సిద్ధిఖీ యక్షసాన్ పాత్రలో శక్తివంతమైన నటన చూపించారు. హారర్, కామెడీ, థ్రిల్లింగ్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం థియేటర్లలో సాధించిన విజయాన్ని ఇప్పుడు ఓటీటీలో కూడా కొనసాగించనుందనే అంచనా వ్యక్తమవుతోంది.

## ఐశ్వర్య రాజేష్‌తో తిరువీర్ పాన్ ఇండియా చిత్రం...




**–'ఓ సుకుమారి' ఫస్ట్ లుక్ రిలీజ్...**

**హైదరాబాద్,** టాలీవుడ్ యంగ్ టాలంటెడ్ నటుడు తిరువీర్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. 'మసూద', 'పరేషాన్', 'ప్రీ వెడ్డింగ్ షో' వంటి వరుస చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన ఈసారి ఏకంగా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న భారీ చిత్రంలో నటించడం విశేషంగా మారింది. ఈ చిత్రంలో కథానాయికగా జాతీయ అవార్డు గ్రహీత, నటి ఐశ్వర్య రాజేష్‌ను ఎంపిక చేశారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు 'ఓ సుకుమారి' అనే టైటిల్‌ను ఖరారు చేసి, తాజాగా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది. గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని భరత్ దర్శన్ దర్శకత్వం వహిస్తున్నారు. పాత్రల రూపకల్పన నుంచి కథా నేపథ్యం వరకు మొత్తం ప్రాజెక్ట్‌ను పాన్ ఇండియా ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా తీర్చిదిద్దుతున్నట్లు చిత్రబృందం తెలిపింది. విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో గ్రామీణ వాతావరణం, సాఫ్ట్ రొమాంటిక్ టచ్ స్పష్టంగా కనిపించగా.. తిరువీర్ ఐశ్వర్య రాజేష్ జంట ఎలా ఆకట్టుకుంటారన్న ఆసక్తి పెరుగుతోంది తిరువీర్ కెరీర్‌లో ఇది మరో కీలక మైలురాయిగా మారనుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఐశ్వర్య రాజేష్ సరసన ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ ఎలా ఉండబోతోందో తెలుసుకునేందుకు ప్రేక్షకులు, ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను చిత్రయూనిట్ వెల్లడించనుంది.

## అఖండ 2కి ఏపీలో భారీ ఊరట...



**– టికెట్ హైక్, బెనిఫిట్ షోలకు గ్రీన్‌సిగ్నల్...**

**అమరావతి,** నందమూరి బాలకృష్ణ నటించిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అఖండ 2' విడుదలకు కేవలం మూడు రోజుల ముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ చిత్రానికి టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వడంతో పాటు బెనిఫిట్ షోలను నిర్వహించేందుకు కూడా ప్రత్యేక అనుమతులు మంజూరు చేసింది. దీంతో సినిమా విడుదలకు ముందే బాలయ్య అభిమానుల్లో సందడి నెలకొంది. డిసెంబర్ 4వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్యలో ప్రీమియర్ షోలను ప్రదర్శించేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ప్రత్యేక ప్రీమియర్ షోలకు టికెట్ ధర రూ. 600గా నిర్ణయించినట్లు సమాచారం. అదేవిధంగా డిసెంబర్ 5న అఖండ 2 విడుదలైన తర్వాత తొలి పది రోజుల పాటు పెరిగిన టికెట్ ధరలు అమల్లో ఉంటాయి. సింగిల్ స్క్రీన్లలో టికెట్‌పై అదనంగా రూ. 75, మల్టీప్లెక్స్‌లలో రూ. 100 పెంపును ప్రభుత్వం ఆమోదించింది. టికెట్ హైక్‌పై వచ్చిన ఈ భారీ ఊరటతో నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే, ఇప్పుడు బాలయ్య చిత్రం కోసం తెలంగాణలో కూడా టికెట్ ధరల పెంపునకు అనుమతి లభిస్తుందా అన్న ఆసక్తి పెరిగింది. ఇటీవల తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి "ఇకపై టికెట్ ధరల పెంపు ఉండదు" అని ప్రకటించిన నేపథ్యంలో, 'అఖండ 2'కు మాత్రం మినహాయింపు ఇస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది. ఏపీ నిర్ణయంతో తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగినట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి. అఖండ ఫ్రాంచైజ్‌కు ఉన్న బలమైన ఫాలోయింగ్, బాలయ్య తాజా క్రేజ్, ముందు భాగం సక్సెస్‌ఈ నేపథ్యంతో ఈ సీక్వెల్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టికెట్ ధరల పెంపుతో పాటు ప్రీమియర్ షోలకు అవకాశం రావడంతో అభిమానుల్లో ఇప్పుడు వేడి పెరిగింది.

## ధురంధర్ చిత్రంపై వివాదానికి ముగింపుపలికిన సీబీఎఫ్‌సీ




**హైదరాబాద్,** బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ నటించిన కొత్త చిత్రం 'ధురంధర్'పై కొద్ది రోజులుగా కొనసాగుతున్న వివాదానికి స్పష్టత లభించింది. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మేజర్ మోహిత్ శర్మ జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఈ సినిమాను తీశారనే ఆరోపణలు రావడంతో, ఆయన తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. తమ అనుమతి లేకుండా కుటుంబ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా సినిమా రూపొందించారంటూ వారు చేసిన ఫిర్యాదు ద్వారా ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు చిత్ర పరిశీలనా మండలి ఈ సినిమాను మళ్లీ పరిశీలించింది. పునః సమీక్ష అనంతరం మండలి స్పష్టంచేస్తూ, 'ధురంధర్' కథ పూర్తిగా కల్పితమైందనీ, దీనికి మేజర్ మోహిత్ శర్మ జీవితానికి ఎలాంటి పోలిక లేదనీ నివేదించింది. కథ, పాత్రలు, సంఘటనలు కల్పిత నేపథ్యంగానే రూపొందించబడ్డాయని సీబీఎఫ్‌సీ స్పష్టత ఇవ్వడంతో, చిత్రంపై నెలకొన్న అపోహలు దిగుముఖం పట్టాయి. మేజర్ మోహిత్ శర్మ పేరు, సేవలు, కుటుంబ గౌరవాన్ని ఉపయోగించారనే అనుమానాలు వ్యక్తం కావడంతో సోషల్ మీడియాలో కూడా పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో సీబీఎఫ్‌సీ ఇచ్చిన నివేదికతో ఈ వివాదం తాత్కాలికంగా ముగిసిందని చెప్పవచ్చు. ఇప్పుడు చిత్ర విడుదలకు ఎలాంటి అడ్డంకీలు లేవని సమాచారం.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,** Email:Mana vaartha tg. Daily@gmail.com